ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



## జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం. అర్హులైన వారు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఓ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం లేదా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. బి.పి.ఎల్ కుటుంబాలలో కుటుంబాన్ని పోషించే ప్రధాన వ్యక్తి 18 నుంచి 60 సంవత్సరాల వయసు గలవారు మరణిస్తే వారు కుటుంబానికి ఈ పథకం కింద 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ పథకానికి సంబంధించి మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇతర ఆర్థిక సహాయాలు అందకుండా ఉండాలని , అప్పుడే ఈ పథకం అమలు అవుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# బ్రహ్మోత్సవాలలో భక్తులకు అన్ని ఏర్పాట్లు

జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేటినుండి ప్రారంభం కానున్నాయి.13 రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే జాతరకై వచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన అధికారులు పూర్తిచేస్తున్నారు.గురువారం జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్ ధర్మపురి క్షేత్రాన్ని సందర్శించారు.గోదావరి నదీతీరం,ఆలయ ప్రాంగణం,బ్రహ్మపుష్కరిణి (కోనేరు) పరిసరాలలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాతరకు వచ్చే ఏ ఒక్క భక్తుడికి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు.రవాణా,ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు పూర్తిచేయాలని తెలిపారు. శానిటేషన్,ఆరోగ్య శిబిరాలు,అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఆర్డీఓ మధుసూదన్,మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి , వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య,మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, దేవస్థానం ఈఓ సంకటాల శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు జక్కు రవీందర్, తహసీల్దార్ ఏ.శ్రీనివాస్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పోక్సో కేసులో
# నాలుగు సంవత్సరాల ఖైదు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** జిల్లాలోనేరాలకు పాల్పడిన వారికి జైలుశిక్ష తప్పదని శిక్షతోనే మార్పుజరుగుతుందని రాజన్నసిరిసిల్లా ఎస్పీమహేష్‌గీతే గురువారం అన్నారు. మైనర్‌బాలికపై బలవంతపు వేధింపులు, ఫోక్సో కేసులో ఇద్దరి నిందితులకు నాలుగుసంవత్సరాలు, రెండువేలు జరిమానా విధించడం జరిగిందని రాజన్న సిరిసిల్లా జడ్జి రాధికజైస్వాల్ ఇచ్చాన తీర్పు వెల్లడైందని ఎస్పీ మహేశ్‌గీతే మీడియాతో తెలిపారు. అప్పటి ఎస్సై వెంకటకృష్ణ కేసునమోదు చేయగా దర్యాప్తు జరిగిందన్నారు. అనంతరం అప్పటి డీఎస్పీఖర్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా పది మంది సాక్షులను పెట్టాగ కేసుపూర్వపరల పరిశీలన మేరకు సిరిసిల్లా ఫోక్సో కోర్టు శిక్షను ఖరారు చేసింది. ఇద్దరు నిందితులు తుర్పటి జాని,పోచవ్వలకు జైలుశిక్షతో పాటు 4 సంవత్సరాలు రెండువేల జరిమాన విధించారని పేర్కొన్నారు. శిక్షపడటంలో సహకరించిన పీపీలు లక్ష్మి ప్రసాద్, శ్రీనివాస్, సిఎంఎస్ ఎస్ఐ రవీంద్రనాయుడు, కోర్టు కానిస్టేబుల్, నవీన్, శ్రీనివాస్, ఎస్ఐ వెంకటకృష్ణ, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## మహిళల భద్రత,ప్రజల రక్షణే
# నారీ శక్తి ప్రధాన లక్ష్యం

ఎస్‌పి డా.జి.జానకి షర్మిల

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ''నారి శక్తి'' కార్యక్రమం గురువారం(నిన్న) మరింత ప్రభావవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీస్ సిబ్బంది తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, వచ్చిన డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి బాధితుల సమస్యలను వేగంగా పరిష్కరించారని జిల్లా ఎస్పీ తెలిపారు. వీటితో పాటు గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించి పిల్లలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. అంతేకాకుండా గ్రామాల్లో ఉన్న ప్రజలకు మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెంట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరించారు. నారిశక్తులు వాహన తనిఖీలు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించి,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఈ 'నారి శక్తి' కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల మహిళా సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.



# ముందస్తు ప్రణాళికతో చదివితే విజయం బానిస అవుతుంది



ప్రజాపక్షం/చొప్పదండి: విద్యార్థులు ముందస్తు ప్రణాళికతో చదువుకుంటే విజయం బానిస అవుతుందని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల ప్రిన్సిపల్ ఎల్.స్వాతి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని గురుకులంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు నిజజీవితంలో రాణించాలంటే సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థి దశ చాలా కీలకమైనదని అన్నారు. ఏకాగ్రత ఉంటే లక్ష్య సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు జ్ఞాపకాలను అందజేశారు. అనంతరం గురుకుల సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తెలంగాణ సాంప్రదాయ బద్ధంగా మూస్తాబై ఆటపాటతో అలరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల సీనియర్ వైస్ ప్రిన్సిపల్ స్వప్న, గురుకుల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంభోజీ శేఖర్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి దేవేందర్, ఉపాధ్యక్షులు సంభోజీ అనిల్, కార్యవర్గ సభ్యులు పిట్ట భూమయ్య, గురుకుల సిబ్బంది ఉన్నారు.

# చొప్పదండి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు



ప్రజాపక్షం/చొప్పదండి: చొప్పదండి లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి అధ్యక్షుడు తొడుపునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా కాబోయే గవర్నర్ ప్రస్తుత ఎఫ్‌విడిజి లయన్ మోర భద్రేశం హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎఫ్‌విడిజి, ఆర్‌సి కొల్లూరి జితేందర్, జడ్‌సి చింతల రవి, క్లబ్ సభ్యులందరి సమక్షంలో రాబోవు లయనిస్టిక్ ఇయర్ 2026–27 సంవత్సరానికి క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా లయన్ వల్లాల జగన్, సెక్రటరీగా లయన్ దూస రాము, ట్రెజరర్‌గా లయన్ సిరిపురం రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కొల్లూరి ఆనందం ప్రతిపాదించగా ప్రస్తుత అధ్యక్షుడు తొడుపునూరి సత్యనారాయణ, ట్రెజరర్, కౌన్సిలర్ పిట్టల వెంకటేష్, రీజియన్ సెక్రటరీ మహేషుని మల్లేశం, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ వల్లాల క్రిష్ణహరి, ఎడ్యూకేషనల్ ట్రస్ట్ చైర్మన్ పెద్ది లక్ష్మీ కాంతంలు బలపరిచారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చొప్పదండి సభ్యులు తొడుపునూరి లక్ష్మయ్య, మామిడి రాజేష్ పవార్, మాదారి శ్రీనివాస్, గొల్లపల్లి నరేష్, బొల్లం జగదీష్, పెద్ది మురళి, దూస కైలాసపతి తదితరులున్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/ముత్తారం: రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత 420 హామీలు,6 గ్యారంటీల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ 27 నెలల పాటు పాలించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు 15 వేల రూపాయల చొప్పున ఇస్తానని మాట తప్పి 12 వేల రూపాయల చొప్పున రెండుసార్లు మాత్రమే ఇచ్చి రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వం ఆ రెండుసార్లలో ఒకసారి గత ఎన్నికల ముందు నిల్వ ఉన్నవేనని అన్నారు. ఇగో రైతు భరోసా అగో రైతు భరోసా అని కాలయాపనకు పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తక్షణమే అతి భరోసానిధులు విదుదల చేసి రైతులకు అండగా ఉండాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ గట్టయ్య చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మూగ మల్లేష్, రమేష్‌తో పాటు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/గంగాధర: గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ప్రధానమంత్రి సంసద్ క్రీడా మహోత్సవం 202526 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా నాయకుడు గాజ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ మహోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మండల కేంద్రాల్లో టీంల నమోదు ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మార్చి 1 నుంచి 3 వరకు అసెంబ్లీ స్థాయిలో, మార్చి 5 నుంచి 7 వరకు పార్లమెంటు స్థాయిలో పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 8న కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, కటకం లత, బిజెపి అధ్యక్షుడు పర్వరాములు, తుమ్ నారాయణ, మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గుండారం మధు, రేండ్ల శ్రీనివాస్, పోచంపల్లి నరేష్, వొద్నాల రాజు, తాళ్ల రాజశేఖర్, దయ్యాల ప్రణయ్, బిజెపి నాయకులు ఆకుల మనోహర్, తుమ్ కరుణాకర్, పృథ్వీ గౌడ్, అనిల్ కుమార్ తదితరులున్నారు.

# ఇంటర్ రెండవ సంవత్సర మొదటి పరీక్ష ప్రశాంతం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జిల్లాలో ఇంటర్ రెండవ సంవత్సరం మొదటి పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్ రెండవ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ భాష పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (4815) మంది హాజరు కావాల్సి ఉండగా, (4731)మంది హాజరు కాగా,(74) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఈ రోజు 98 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని, ఈ రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలలో భవిత సెంటర్ విద్యార్థి ప్రతిభ



ప్రజాపక్షం/చొప్పదండి: చొప్పదండి పట్టణంలోని హరికిషన్ ఇప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు గల భవిత సెంటర్ విద్యార్థి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచారని భవిత సెంటర్ ఐఈఆర్‌పిలు పెద్ది శ్రీనివాస్, డి.పద్మలు తెలిపారు. ఈ మేరకు హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలలో భవిత సెంటర్ సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థి ఎ. ఆదిత్య (8వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మెడల్ సాధించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి విద్యార్థికి సర్టిఫికెట్ ప్రధానం చేసి అభినందించారు. దివ్యాంగ విద్యార్థులకు క్రీడలలో పాల్గొనే సామర్థ్యం ఉందని, అందుకే తమ పాఠశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. మండల విద్యాధికారి పి.మోహన్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, ఐఈఆర్‌పిలు వి.శ్రీనివాస్, డి.పద్మ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

# వాటర్‌ప్లాంట్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



ప్రజాపక్షం/చొప్పదండి: పురపాలక సంఘం చొప్పదండి కార్యాలయం ద్వారా 20 లీటర్ల నీటికి రూ. 5కు అందించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ వద్దూరి సరిత ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్ పట్టణంలో ప్రారంభించారు. పట్టణంలోని మంచినీటి బావి నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి ప్యూరిఫైడ్ వాటర్ అందించడం జరుగుతుందని తెలిపారు. 20 లీటర్ల క్యాను కేవలం రూ.5కే కాయిన్ బాక్స్‌లో వేసి ప్యూరిఫైడ్ వాటర్ పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని చొప్పదండి పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య గౌడ్, కౌన్సిలర్లు చిల్ల అర్చన శ్రావణ్ కుమార్, పిట్టల వెంకటేష్ తదితరులున్నారు.

# మార్కండేయ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/మల్లాపూర్ : మల్లాపూర్ మండలంలోని పాత దామరాజు పల్లి గ్రామంలోని మార్కండేయ ఆలయ వార్షికోత్సవ వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకి సేవ లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకార్చనలతో పూజలు జరిపించారు. వందలాది సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోగా భక్తులకు , హనుమాన్ దీక్ష స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి రాజారెడ్డి, గణేష్, అయ్యోరి దశరథం, ద్యావనపల్లి ప్రతాప్, గాదె మనోహర్, గ్రామంలోని ప్రజా ప్రతినిధులు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలే లక్ష్యం

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్: ప్రస్తుత ఎన్నికల్లో డబ్బు, మద్యం ఏరులై పారుతుందని, కార్పోరేట్ శక్తులు వ్యాపారులు ఎన్నికల్లో పాల్గొని ధన ప్రవాహాన్ని చూపెడుతూ ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రైతు వ్యతిరేక చట్టాలు చేసిందని, జై కిసాన్ అంటూనే 1200 మంది రైతులను నిర్దాక్షిణంగా చంపారని అన్నారు. కార్పోరేట్ శక్తులకు అనుగుణంగా లేబర్ కోడ్‌లను మార్చి కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చారని, వామపక్షాలు పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రామ్‌జీ పేరుతో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. అర్బన్ నక్సలైట్లను, మావోయిస్టులను చంపుతామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు గుండాయిజం చేస్తున్నారన్నారు. ఎవరైనా తప్పు చేస్తే శిక్షించడానికి కోర్టులు ఉన్నాయని, అలాకాకుండా అర్బన్ నక్సలైట్లను చంపేస్తామని అనడానికి అతను ఎవరని ప్రశ్నించారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు రాజకీయ పార్టీ పెడితే స్వాగతిస్తామని, ఆ రాజకీయ పార్టీ వర్గ దోపిడికి అసమానతలకు, వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులు ప్రజల పక్షాన పోరాడితే కలిసి పని చేయడానికి అభ్యంతరం లేదని అన్నారు. రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో కుల రక్కసి కోరల్లో పసిపాప బలైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బాధ్యులను కఠినంగా శిక్షించి బాధితులకు సరైన న్యాయం చేయాలని , రాష్ట్రంలో కుల దురంకార హత్యలు అరికట్టాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ యులు పాలడుగు భాస్కర్, ఎస్.రమ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్ తదితరులున్నారు.

# గంగాధరలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌కు హరీష్‌రావు రాక


ప్రజాపక్షం/గంగాధర: గంగాధర మండల కేంద్రంలో గత నెల రోజుల నుంచి జరుగుతున్న కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ఎడ్ల అనిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు హైదరాబాదులో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. గంగాధరలో జరిగే క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌కు హాజరు కావాలని కోరారు. అదే విధంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అత్తమ్మ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు ఫైనల్ మ్యాచ్‌కు హాజరు కానున్నారని వారు పేర్కొన్నారు. గంగాధర మండల బిఆర్‌ఎస్ నాయకులు పుటుకం, రవీంద్రనాథ్ ఠాగూర్, మడ్డపెల్లి రమేష్, మాజీ ఎంపిటిసి రాజయ్య, ప్రశాంత్‌రెడ్డి, ఎడ్ల అనిల్, పంజాల మహేష్, గంట అనిల్, ఎన్‌టిఆర్, నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పంబట్ల గ్రామంలో గురువారం కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిభాపూలే మహిళా వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పెంబట్ల గ్రామ పంచాయితీ ఆవరణలో బాగస్వామ్య గ్రామీణ అంచనాపై రైతులకు అవగాహన కల్పించారు. దాదాపు రెండు నెలల క్రితం ఐదుగురు విద్యార్థులను గ్రామానికి కేటాయించడంతో, క్షేత్ర స్థాయి అధ్యయన కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతులకు చెందిన పంట పొలాలను సందర్శించారు. పంటలను ఆశిస్తున్న చీడపీడలను పరిశీలించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ కార్యాలయం ముందు గ్రామంలోని వివరాలను వివిధ రంగులతో వల్లించడంతో పాటు ప్రధాన భవనాల నమూనాలను అట్టలతో రుపొందించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలపాక రాధ రాజు, ఉప సర్పంచ్ మైదం ప్రభాకర్, వార్డు సభ్యులు తోట లక్ష్మ ణ్, ఉత్తమ రైతు బండారి వెంకటేష్, రైతులు బాదినేని శంకర్, తోట శేఖర్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు మదిహా, సుష్మ, పల్లవి, రవళి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవి తరగతి విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక ఎస్ఐ వేముల లక్ష్మ న్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్ అభినందనీయమని, విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు జాలపెల్లి మనోజ్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ప్రతి సంవత్సరం టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. వార్షిక పరీక్షల సమయంలో విద్యార్థుల్లో దాగి ఉన్న భయాన్ని తొలగించడానికి ఈ టాలెంట్ టెస్ట్‌లు ఎంతగానో ఉపాయోగపడతాయని, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు కూడా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపల్ అనూష, ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## ఇటిక్యాలకు పున: బస్సు ప్రారంభం



**ప్రజాపక్షం/రాయికల్:** రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి గత ఏడాది కాలంగా ఇటిక్యాల గ్రామానికి కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాకపోకలు నిలిచిపోయాయి.ఇట్టి సమస్యపై మాజీ సర్పంచులు మరిపెల్లి నారాయణ గౌడ్,సామల్ల లావణ్య వేణు,ప్రస్తుత సర్పంచ్ నీరటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తుల ప్రయాణ ఇబ్బందులను గురించి కోరుట్ల డిపో మేనేజర్ దృష్టిలో తీసుకొని వెళ్లి బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా గురువారం నుండి బస్సు సర్వీస్ సేవలు పునరుద్ధరించారు. నాయకులు చేసిన కృషి వల్ల డిపో మేనేజర్ తీసుకున్న నిర్ణయంతో ఇటిక్యాల గ్రామానికి బస్సు రాకపోకలు తిరిగి ప్రారంభం కావడం వల్ల గ్రామస్తులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.ఈ నూతన సర్వీసు వల్ల విద్యార్థులకు,చిరు వ్యాపారులకు మరియు సామాన్య ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుందని గ్రామస్తులు తెలిపారు.

## వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల కోనాపూర్ గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి దేవస్థానంలోని అనుబంధ ఆలయం శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా వేద పండితులచే నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఆలయ కార్యనిర్వహణ అధికారి వి. అనూష. సాయంత్రం వేళలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి పల్లకి సేవ, పవళింపు సేవ నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, ఆలయంలో ఏడుకొండల వాడా వెంకటరమణా గోవిందా గోవిందా అంటూ నామస్మరణతో మారు మోగుతుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త పోరండ్ల శంకరయ్య, సర్పంచ్ కొలపాక రాధ రాజు, ఆకుల రమేష్, రెంటం జగదీష్, ఆలయ ధర్మకర్తలు, మాజీ ఈవో నారాయణ, మాజీ ధర్మకర్త బాపురెడ్డి, అర్చకులు, సిబ్బంది, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఊరిపై మమకారం ...ఆలయ నిర్మాణానికి సహకారం

**ప్రజాపక్షం/జగిత్యాల:** విధి నిర్వాహణలో ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసులు తమ సొంత ఊరిపై మమకారాన్ని పెంచుకున్నారు. జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం నమిలకొండ గ్రామంలో శ్రీ లక్ష్మి నృసింహా స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న ఆలయానికి తమ వంతుగా సహకారం అందించి శభాష్ పోలీస్ అనిపించుకున్నారు. నమిలకొండ గ్రామంలో 17 మంది యువకులు పోలీస్ శాఖతో పాటు ఆర్మీ, సీఐఎస్ఎఫ్, ఏయిర్ ఫోర్స్ విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి రూ. 50 వేళ విరాళాన్ని గ్రామ సర్పంచ్ శాబోద్దీన్‌కు అందజేశారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. విరాళం అందించిన వారిలో ఇరుమల్ల తిరుపతి, ఇరుమల్ల శ్రీనివాస్, ఇరుమల్ల మహిపాల్, విలాసాగరం శ్రీనివాస్, విలాసాగరం సాగర్, మొట్టె మల్లేశం, బోడపట్ల కరుణాకర్, దయ్యాల మహేందర్, దొంతిసారపు సాయి చందు, కంబల్ల రాజశేఖర్, చెట్టె మహేష్, బండారి మహిపాల్, ఉప్పరి జాషువా, మంద శ్రీకాంత్, ముత్యాల రాజశేఖర్, మల్యాల శేఖర్, దొంతిసారపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మార్చి 25లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు దరఖాస్తు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మార్చి 25 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపిక కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాల్లోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కి రెసిడెన్షియల్ అండ్ నాన్ రెసిడెన్షియల్ పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కి రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజనంతో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు గాను విద్యార్థికి 42 వేల చొప్పున, నాన్ రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్ తో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు గాను ప్రతీ విద్యార్థికి 28 వేల చొప్పున చెల్లించబడుతుందనీ తెలిపారు.దరఖాస్తు ఫారముల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయము పెద్దపల్లి యందు సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను మార్చి 25 లోగా కార్యాలయములో అందించాలని, ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ ప్రకటనలో కోరారు.

## స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం రామజీ పేట గ్రామ శివారులో గురువారం స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే గుండంపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి మధు (35) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఉండగా ఎదురుగా వస్తున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు చెందిన బస్సు ఢీ కొట్టింది. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై సుధీర్ రావు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కలెక్టర్, డిఆర్ఓల బదిలీ

**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం గురువారం చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీల్లో బాగంగా కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్న పమేలా సత్పతి, జిల్లా రెవెన్యూ అధికారి బి. వెంకటేశ్వర్లు ను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా పమేలా సత్పతి 2023 అక్టోబర్ 31న బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో తనదైన శైలీలో పాలనను కొనసాగించారు.శుక్రవారం సభ, స్నేహిత, ఎడ్యుటాక్ వంటి వినూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి విద్యా, వైద్యం, మహిళ, శిశు సంక్షేమ రంగాల్లో విశేష కృషి చేశారు. జిల్లా రెవెన్యూ అధికారిగా 2024 అక్టోబర్ 18న బాధ్యతలు చేపట్టిన బి. వెంకటేశ్వర్లు జిల్లాలో మంచి అధికారిగా పేరుపొందారు. ఇటీవల కన్‌ఫర్డ్ ఐఏఎస్ గా పదోన్నతి పొందారు.. తాజా బదిలీల్లో నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ)గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

## గంజాయి సాగు కేసులో ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష

**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రభుత్వం నిషేందించిన గంజాయి సాగు, సరఫరా, అమ్మకానికి పాల్పడ్డ వ్యక్తికి ఏడు సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ఒకటవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి నారాయణ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామానికి చెందిన మోస్రాం నాగనాథ్ అనే తనకు ఉన్న వ్యవసాయ భూమిలో సోయా, పత్తి పంటలు వేస్తూ కులుంబాన్ని పోషించుకుంటున్నాడు. అదనపు డబ్బు సంపాధించాలనే ఆలోచనతో పంటల మధ్య గంజాయి పంటను సాగు చేసి రహస్యంగా రవాణా చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఇదే క్రమంలో 2023 నవంబరు నెలలో నాగనాథ్ ఎండు గంజాయిని సంచిలో పెట్టుకుని జగిత్యాల జిల్లా రాయికల్‌లో విక్రయంచేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో రాయికల్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి వివరాలను న్యాయస్థానంలో దాఖలు చేశారు. గురువారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టులో కేసు వాధించగా, కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి నాగనాథ్‌కు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పువెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులు ఆరీఫ్అలీ ఖాన్, ఎస్సై అజయ్, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, నరేష్, రాజు నాయక్, కిరణ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## ఇసుక అక్రమ దందాకు అడ్డొస్తే తొక్కించేస్తాం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని వెంకట్రావు పేట గోదావరి నదిలోని నల్లమడుగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తే తమ అక్రమ దందాకు అడ్డు వస్తే చంపేస్తామని ఇసుక రవాణా చేసే వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని వెంకట్రావుపేట గ్రామ సర్పంచ్ కనుమల వెంకటేష్ గురువారం అన్నారు. నల్లమడుగు నుండి జెసిబిల సాయంతో లారీలలో ఇసుక తరలిస్తున్నారని ఇష్టం వచ్చినట్లు ఇసుక తీయడంతో భూగర్భ జలాలు అడుగంటి రోడ్లు ధ్వంసమై, భవిష్యత్తులో అభివృద్ధి పనులకు ఇసుక కొరత అవుతుందని ఫిర్యాదు చేయగా గ్రామ ప్రథమ పౌరుడు అని చూడకుండా కొందరు వ్యక్తులు ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతూ చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇసుక అక్రమ రవాణా చేసే వ్యక్తుల నుండి ప్రాణభయం ఉందని, తనకు ఎలాంటి హాని జరిగినా వారి బాధ్యులు అవుతారని మల్లాపూర్ పోలీస్ స్టేషన్లో ఎస్సై అనిల్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల జిల్లాలోని 30 కేంద్రాల్లో ఇంటర్ ద్వీతీయ పరీక్షలను గురువారం ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జనరల్ కోర్సుకు సంబంధించి 5,832, వొకేషనల్ కోర్సుకు సంబంధించి 801 మంది విద్యార్థులు హాజరు కాగా 133 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లాలో 98.3శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా మేడిపెల్లి, కోరుట్ల, మెట్‌పెల్లి, ఇబ్రహీంపట్నం పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించి పలు అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని కోరారు. జిల్లాలో ఏలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఏలాంటి ఇబ్బందులు ఉన్నా 14416కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని జిల్లా పరీక్షల కన్వీనర్ నారాయణ గౌడ్ పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మోసం గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని మోసం గ్రామంలో పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ వేడుకలకు మాజీ ఎంఎల్ఎ కోనేరు కోనప్ప, రమాదేవి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో శాంతి సౌభ్రాతృత్వాలు విరాజిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల జైజైకారాలతో వీధులు మార్మోగాయి. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమన్ కార్ పద్మ, వసంత్ రావు, ఉప సర్పంచ్ రోహిణి పుష్పలత, రామయ్య, మాజీ సర్పంచ్ కునుషోత్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ రౌతు సంతోష్, వార్డు సభ్యులు అంబిలపు గురు, కునుషోత్ దేవయ్య, రమేష్, సత్యన్న, పిప్పిరె పురుషోత్తం, రాజేందర్ పాల్గొన్నారు.

## డ్రైవర్లకు కంటి పరీక్షల నిర్వహణ సద్వినియోగం చేసుకోండి ఎస్ఐ అశోక్

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు,హెవీ వెహికల్ డ్రైవర్లకు లోకేశ్వరం మండలంలోని డ్రైవర్లుకు తేది 27022026 నాడు ఉదయం 10.30 గంటలకు ముధోల్ పోలీస్ స్టేషన్లో ఉచిత కంటి చూపు పరీక్ష,అద్దాల పంపిణీ కార్యక్రమం కలదు ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్మల్ ఎస్పీ హాజరవుతారు.కావున ఇట్టి సదవకాశాన్ని మండల డ్రైవర్లు ఉపయోగించుకొని వాహనాలు నడుపు హెవీ డ్రైవర్లు,ఆటో డ్రైవర్లు వారి యొక్క కంటి పరీక్షలు చూపించుకోవాలని తెలిపారు.

## హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలి

**ప్రజాపక్షం/దస్తురాబాద్ :** హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించి,కూలీ రేట్లు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు.గురువారం కడెం మండల కేంద్రంలో జరిగిన హమాలీలకు ఒకే రకమైన రేట్లు ఉండాలని,ఎరువుల బస్తా లోడింగ్అన్ లోడింగ్‌కు రూ.15 చెల్లించాలని కోరారు.ప్రభుత్వం వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి,కార్మికులకు రూ.6 వేల పెన్షన్ అందించాలని,లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.అనంతరం కడెం మండల నూతన హమాలీ కమిటీని ఎన్నుకున్నారు.

## రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో మంచిర్యాల విద్యార్థుల సత్తా

### మరుపాక శ్రీలత, జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి




**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 19 నుండి 21 వరకు నిర్వహించిన రెండో ఎడిషన్ సిఎం కప్ కిక్ బాక్సింగ్ పోటీల్లో మంచిర్యాల జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటి పతకాల పంట పండించారని మంచిర్యాల జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరుపాక శ్రీలత తెలిపారు. జిల్లా పేరు ప్రఖ్యాతలను రాష్ట్ర స్థాయిలో చాటిన క్రీడాకారులను పలువురు అభినందించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల్లో ఐ. హర్షిత బంగారు పతకం సాధించగా, ఎం. రిహన్స్ రజత పతకం కైవసం చేసుకున్నారు. మాన్వి కాంస్య పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. పట్టుదలతో శ్రమించి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా యువజన క్రీడల అధికారి (డివైఎస్ఓ) హనుమంత్ రెడ్డి, కిక్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు సుధమల్ల హరికృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్ తో పాటు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఒకే భవనంలో రెండు విద్యాసంస్థలా?

### విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే భవనంలో రెండు వేర్వేరు విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారని, వాటిపై తక్షణమే తనిఖీలు చేపట్టి సీజ్ చేయాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ) కి ఫిర్యాదు చేశారు. బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో సూర్య తేజ పారామెడికల్ ఇన్స్టిట్యూట్, లక్ష్మి నర్సింగ్ స్కూల్ అనే రెండు సంస్థలు ఒకే ప్రాంగణంలో కొనసాగుతుండటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పారామెడికల్, నర్సింగ్ కళాశాలలకు వేర్వేరు భవనాలు, మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు ఉండాలని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఒకే భవనంలో రెండు సంస్థలు నడపడం విద్యా నియంత్రణ మార్గదర్శకాలకు విరుద్ధమని, వీటికి అసలు అనుమతులు ఉన్నాయా అన్న సందేహం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన శిక్షణ లేని వ్యక్తులు వైద్య రంగంలోకి రావడం ప్రజారోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. అధికారులు స్పందించి విచారణ జరిపి సదరు సంస్థల గుర్తింపు రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులు మరియు న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదు ప్రతులను జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత విభాగాల డైరెక్టర్లకు పంపినట్లు ఆయన తెలిపారు.

# నీతి ఆయోగ్ నిధులు ఏమాయే?

### తిర్యాని అభివృద్ధిపై పారదర్శకత కరువు

**ప్రజాపక్షం / తిర్యాని :** మారుమూల గిరిజన ప్రాంతమైన తిర్యాని మండల అభివృద్ధిపై నీతి ఆయోగ్ ప్రత్యేక దృష్టి సారించిందని గతంలో వెలువడిన ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర స్థాయి సంస్థ ద్వారా భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం గతాన్ని తలపిస్తున్నాయి. రహదారులు, తాగునీరు, వైద్యం వంటి కనీస మౌలిక సదుపాయాల కోసం స్థానిక ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

### అసంపూర్తి పనులు.. అవస్థల బాట

మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పనులు మధ్యలోనే నిలిచిపోవడం గిరిజనుల పాలిట శాపంగా మారింది. రహదారి విస్తరణ పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్నారు. వర్షాకాలం వస్తే ఈ మార్గం బురదమయంగా మారి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. భవనాల నిర్మాణం మాత్రమే అభివృద్ధి కాదని, నాణ్యమైన రోడ్లు, రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### అందని వైద్యం.. తీరని దాహం

మండలంలోని అనేక గ్రామాల్లో నేటికీ సురక్షిత తాగునీరు అందని ద్రాక్షగానే మిగిలింది. నిధుల కేటాయింపులు జరుగుతున్నా గ్రామాలకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా వైద్య సిబ్బంది, మందులు లేకపోవడంతో చిన్నపాటి అత్యవసర పరిస్థితి తలెత్తినా జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది. వైద్య సేవల నాణ్యత పెంచకుండా నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### పారదర్శకత ఏదీ?

ప్రతి ఆరు నెలలకు ఒకసారి అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా, నిధుల వినియోగంపై స్పష్టమైన సమాచారం బయటకు రావడం లేదు. ఏ పనికి ఎంత నిధులు కేటాయించారు, ప్రస్తుతం ఆ పనుల పురోగతి ఏమిటనే అంశాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. కేటాయించిన కోట్లాది రూపాయల నిధులు నిజంగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలంటే అధికారులు పారదర్శకతతో వ్యవహరించి, నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే విజయం

### మోటివేటర్ మద్దివేని అర్జున్

**ప్రజాపక్షం / కాసిపేట :** పదవ తరగతి విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో పరీక్షలు రాస్తే తప్పకుండా విజయం సాధించవచ్చని మోటివేటర్ మద్దివేని అర్జున్ అన్నారు. కాసిపేట మండల కేంద్రంలోని దేవపూర్ పంచాయతీ పరిధిలో గల గిరిజన బాలికల పాఠశాలలో గురువారం సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో జడ్‌పిహెచ్ఎస్, ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పరీక్షలంటే భయం విడనాడాలని సూచించారు. చదువులో వాయిదాల పద్ధతి మానుకొని ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని మెలకువలు బోధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవపూర్ సర్పంచ్ రాందాస్ మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.మోటివేటర్ మద్దివేని అర్జున్, రోడ్డ గోపాల్, సర్పంచ్ రాందాస్, ఆదివాసీ నాయకపోడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, మద్దినేని చిన్న భీమయ్య పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

### రెబ్బెన సిఐ సంజయ్ కుమార్



**ప్రజాపక్షం / తిర్యాణి :** తిర్యాణి మండలం ఎడులపాడు గ్రామంలో రెబ్బెన సిఐ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు ఆకస్మికంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇటీవల ప్రాంతంలో అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందడంతో ప్రత్యేక బృందాలు గ్రామాన్ని ముట్టడించి తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రధాన రహదారులు, వీధులు, ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించి అనుమానితుల వివరాలు సేకరించి, సరైన పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరుగుతుందన్నారు. గ్రామంలో గంజాయి, మద్యం అక్రమ రవాణా, జూదం వంటివి సహించబోమని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ తనిఖీల్లో తిర్యాణి ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

### అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన



**ప్రజాపక్షం / పెంచికల్ పేట్ :** పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ప్రధాన వీధులు, కాలనీల్లో తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నూతన స్తంభాల ఏర్పాటు, పాడైన తీగల మార్పిడి చేయాలని కోరినా స్పందన లేదని తెలిపారు. వర్షాకాలంలో తడిసిన రోడ్లపై తీగలు తక్కువ ఎత్తులో ఉండటం వల్ల విద్యుత్ షాక్ ప్రమాదం పెరిగిందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, రైతులు ఈ మార్గాల్లోనే సంచరిస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఇప్పటికైనా అధికారులు గ్రామాన్ని సందర్శించి ప్రమాదకర పరిస్థితులను అంచనా వేసి, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా అనర్థం జరిగితే బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నిస్తున్నారు.

## మురికి కాలువలో పడ్డ గోవు..

### గంటపాటు శ్రమించి కాపాడిన మున్సిపల్ సిబ్బంది

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో మానవత్వం చాటుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది.పట్టణంలోని 13వ వార్డు రవి నగర్ ప్రాంతంలో ఒక గోవు ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడిపోయింది.కాలువ లోతుగా ఉండటంతోన అవు బయటకు రావడానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది.బురదలో కూరుకుపోయి ఇబ్బంది పడుతున్న గోవును గమనించిన స్థానికులు వెంటనే వార్డు కౌన్సిలర్ ధర్మాజీ రమ్య ఈశ్వర్‌లకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే కౌన్సిలర్ దంపతులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.వారు మున్సిపల్ కార్మికులను,స్థానికులను సమన్వయం చేసి రక్షణ చర్యలు చేపట్టారు.

## యూరియా కోసం ఎరాజ్.. పల్లి గ్రామ రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/బోధన్:** యూరియా కోసం బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామ రైతులు గురువారం గోదాముల ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామంలోని రైతులకు సకాలంలో యూరియా అందడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని రైతులకు యూరియా కొరత లేకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రోడ్లపై బైఠాయించి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం, ఇది వరకు లాగానే రైతులకు యూరియా పంపిణీ చేయాలని కోరారు. గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ మండలం సాలంపాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో గురువారం సందర్శించారు. అనంతరం సబ్ కలెక్టర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్, మిడ్‌లైన్ పరీక్షలను సమీక్షించారు. తనిఖీ సమయంలో సర్ రెండు, మూడు తరగతులకు చెందిన వర్షిత, గంగ, ప్రసాద్‌ల సమాధాన పత్రాలను పరిశీలించారు. వారి అభ్యాస స్థాయిలను అంచనా వేయడానికి పేపర్‌లను చదవమని చెప్పారు. అదేవిధంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు నుండి పట్టణంలో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహిచబడుతుందని కమీషనర్ గోపు గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 11వ వార్డులో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చైర్మన్ బోదిరె నాగమణి స్వామి ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని అని వార్డులలో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహించటం జరుగుతుందని సానిటేషన్‌లో భాగంగా మురికి కాలువల శుభ్రం, స్ప్రేయింగ్ చేయటం, ఆయిల్‌బాల్స్ వేయటం, బ్లీచింగ్ పౌడర్ చల్లటం వంటి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. లత నర్స య్య, అజయ్‌పవార్, సంగ్యానాయక్, సందీప్, సతీష్, అంజుమ్, సిబ్బంది పాల్గొన్నారు.



## చించోలి(బి) పాఠశాలలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) ప్రభుత్వ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్.జీ.సీ) ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు ఏ.మునిందర్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో మట్టి పాత్రల తయారీపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి,ప్లాస్టిక్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్.జీ.సీ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ విద్యాసాగర్,విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌లో ప్రతిభ చాటిన మునిందర్ రాజును,అలాగే 'అభ్యాస దీపిక' ద్వారా డిజిటల్ బోధనను సులభతరం చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ సునీత,రిసోర్స్ పర్సన్ నర్సయ్య,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## శ్రీహరిరావును కలిసిన నూతన మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది.నిర్మల్ మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన చైర్మన్ అప్పల కావ్య గణేష్ చక్రవర్తి,వైస్ చైర్మన్ ఈ రోజు నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు ని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ భేటీ సందర్భంగా,నూతన చైర్మన్,వైస్ చైర్మన్లు శ్రీహరి రావు ని శాలువాతో కప్పి,పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు.సత్కరించారు.నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన చూపిస్తున్న చొరవను,అందిస్తున్న మద్దతును ఈ సందర్భంగా వారు కొనియాడారు.ఈ మర్యాదపూర్వక సమావేశం కేవలం పలకరింపులకే పరిమితం కాకుండా,పట్టణ అభివృద్ధిపై లోతైన చర్చకు వేదికైంది.ముఖ్యంగా నిర్మల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు,ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం,పార్టీ యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.నిర్మల్ పట్టణ సర్వతోముఖాభివృద్ధికి అందరూ ఒకే తాటిపై ఉండి,ఐక్యంగా కృషి చేయాలని ఈ సందర్భంగా శ్రీహరి రావు వారికి దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు,కార్యకర్తలు,పాల్గొని నూతన పాలకవర్గానికి తమ మద్దతును ప్రకటించారు.

## బోధన్‌లో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష కొనసాగగా విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సదుపాయం, ఎఎన్ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా..? అని గమనించారు. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పరీక్షలలో ఎలాంటి కాఫీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో ఉన్నారు.

## అన్నపూర్ణ సమేత మహాదేవస్వామి కళ్యాణం



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని హాసకొత్తూరలో హరిహర క్షేత్రంలో కొలువుదీరినఅన్నపూర్ణ సమేత మహాదేవ స్వామి కళ్యాణోత్సవం గురువారం గ్రామకమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవ మొదలుకుని శ్రీ అన్నపూర్ణ సమేత మహాదేవ స్వామివారి కళ్యాణం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాగ్రామకమిటీ అధ్యక్షులు బంగ్లా లింబాద్రి సర్పంచ్ నెలిమెల రేవంతి గంగారెడ్డిలు మాట్లాడుతూ ఆలయంలో మూడు రోజుల నుండి త్రియాంకబ హోమ్ కళ్యాణం, కుంకుమార్చన, మహాపూర్ణహుతి, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించామన్నారు. రాత్రికి మృత్యుంజయ హోమం, బలిహరణం, రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావలన్నారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్‌శర్మ, గంగాధర్, శ్రీనివాస్, సత్యానరాయణ, సాగర్, స్వామి పాల్గొన్నారు.

## 2003 ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి

### హైకోర్టు తీర్పును అమలు చేయాలి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 2003 ఉద్యోగుల కు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని హైకోర్టు తీర్పును అమలు చేయాలని పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్ కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును ఛాంబర్‌లో 2003 ఉద్యోగ ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో ప్రభుత్వ మెమో 57 ఆధారంగా ఇటీవల హై కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని వినతి ఇచ్చారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, వేణుగోపాల్, కిషన్, రవీందర్, మోహన్ పాల్గొన్నారు.

## నిర్మల్ నుండి పూరిజగన్నాథ్ ప్రత్యేక బస్సు డిఎం పండరి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆర్టీసీ నిర్మల్ నుండి ఒడిస్సాలో గల పూరి జగన్నాథ్ కు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు.ఈ బస్సు మార్చి 8వ తేదీ నిర్మల్ బస్టాండ్ నుండి మధ్యాహ్నం 2 గం!!కు బయలుదేరి 9వ తేదీ రోజు అన్నవరం,సింహాచలం,అర్సవెల్లి,దర్శనాల అనంతరం పూరి జగన్నాథ్ లో బస 10 తేదీ పూరి జగన్నాథ్ ఆలయం,కోనార్క్ సూర్య టెంపుల్ దర్శనమ్ అనంతరం విశాఖపట్నం,నుండి ద్వారకా తిరుమల వెళ్తుంది.తిరిగి నిర్మల్ కు 13వ తేదీ రోజు ఉంటుందని డిపోమేనేజర్ పేర్కొన్నారు.ఇదివరికే నిర్మల్ నుడి 2 బస్సు వెళ్ళాయి. భక్తుల కోరిక మేరకు ఈ బస్సు పెట్టడం జరిగింది.టికెట్ బుక్ చేసుకునే వారు మా అధికారిక వెబ్సైట్ (tgsrtcbus.in)లేదా మన నిర్మల్ బస్టాండ్ కౌంటర్ లో తీసుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9959226003,7382842582 లో సంప్రదించాలని కోరారు.

## గాంధీనగర్,కావేరి నగర్‌లో ముమ్మరంగా డ్రైనేజీ పూడికతీత పనులు

### కౌన్సిలర్ కత్తి నరేందర్ చొరవ..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పట్టణంలోని 1వ వార్డు పరిధిలో గల గాంధీనగర్,కావేరి నగర్ కాలనీలలో శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ డ్రైనేజీల పూడికతీత కార్యక్రమం నిర్వహించారు.గత కొంతకాలంగా ఈ ప్రాంతాల్లోని మురికి కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను గుర్తించిన వార్డు కౌన్సిలర్ కత్తి నరేందర్, మున్సిపల్ అధికారుల సహకారంతో జేసీబి యంత్రాన్ని తెప్పించి కాల్వలకు క్లీన్ చేయించారు.పేరుకుపోయిన చెత్తాచెదారం,పూడికను తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ..వర్షాకాలం దృష్ట్యా దోమల వ్యాప్తి చెందకుండా,ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో గురువారం రోజు జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల హాజరు వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డి.ఐ.ఇ.ఓ) పరుశురాం వెల్లడించారు.జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు మొత్తం 6,219 మంది విద్యార్థులను కేటాయించగా,వారిలో 6,036 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.కాగా వివిధ కారణాల వల్ల 183 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.పరీక్షలు అత్యంత పారదర్శకంగా,క్రమశిక్షణతో నిర్వహించినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

## మామడలో షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

**ప్రజాపక్షం/మామడ :** నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రంలోని మామడ గ్రామానికి చెందిన రేణి రవీందర్ ఇంట్లో షాట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి,ఇల్లు దగ్ధం కావడం జరిగింది.అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది కానీ అయితే కొత్త ఇంటి నిర్మాణానికి దాచుకున్న డబ్బంతా కాలి బూడిదయింది.బంగారం ఇతర ధ్రువపత్రాలు బట్టలు,ఇంటి సామాగ్రి, టీవీ,ఫ్రిడ్జ్,అంత మంటల్లో కాలిపోవడంతో కుటుంబ సభ్యులు బోరుణ విలపించారు.అధికారులు జి.పి.ఓ నువ్వుల రాజేందర్,గిర్దవరి మెహెరాజ్ హుటాహుటున ఘటన స్థలానికి చేరుకొని భారీ ఆస్తి నష్టానికి పంచనామా నిర్వహించారు.ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బు ఇల్లు బంగారం బట్టలు పూర్తిగా దగ్ధమవడంతో బోరున విలపించారు.ఇంత భారీ నష్టంతో రోడ్డున పడ్డ మా కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను కోరుతూ కన్నీటి పర్యంతమయ్యారు.

